ప్రజాశక్తి
శనివారం 28 జనవరి 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

◆ ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు ◆ జివిఎంసి కమిషనర్ ఆదేశాలు బేఖాతరు



25వ వార్డులో సాగుతున్న అక్రమ నిర్మాణం



మధురానగర్‌లో..

ప్రజాశక్తి - సీతమ్మధార : జివిఎంసి పరిధిలోని 14, 25, 26 వార్డుల్లో అనధికార నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తప్పవని ఒకవైపు జివిఎంసి కమిషనర్ రాజాబాబు ఘాటుగానే హెచ్చరికలు జారీ చేసినప్పటికీ కిందిస్థాయి అధి కారులు, సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం వల్లే ఈ అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట లేకుండా పోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసిపి ఉత్త రాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్, టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి సైతం పలుమార్లు అనధికార నిర్మాణాలకు చోటిస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చ రిస్తున్నప్పటికీ అధికారులు, కార్పొరేటర్ల నిర్లక్ష్య వైఖరికి కారణాలేంటో అంతుపట్టడం లేదని పలువురు అంటున్నారు.

25వ వార్డు మధురానగర్ హైస్కూల్‌కు పక్కన డోర్ నెంబర్ 49-26-21ఎ, మూడు అడుగుల రోడ్డులో జి ప్లస్ టు నిర్మాణానికి అనుమతు లివ్వడంపై స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పరిస్థితి ఉందని ఆరోపణలున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే కనీసం ఫైర్ సిబ్బంది కూడా వెళ్లలేని ప్రాంతంలో అనుమతులు ఎలా ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు. సీతంపేట స్వాగత్ లాడ్జి ఎదురుగా 50-8-3 డోర్ నెంబర్ పక్కన అనధికారికంగా అదనపు అంతస్తు, అదే వార్డులో 50-83-9 అపార్టుమెంట్‌లో పెంట్ హౌస్ నిర్మాణంపై టౌన్ ప్లానింగ్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా స్పందన లేదని అంటున్నారు. 26వ వార్డు జివిఎంసి ఎలిమెంటరీ స్కూల్ వద్ద, అదే వార్డులో డోర్ నెంబర్ 49-16-15లో అనధికారికంగా రూమ్ నిర్మాణం, నరవ కాంప్లెక్స్ ఎదురుగా అపార్టుమెంట్ నిర్మాణం అనధికారికంగానే జరుగుతున్నాయి. వీటికి టిడిఆర్ ఉందని అంటున్న జివిఎంసి అధికారులే, అది మిగతా 2లో..



కెజిహెచ్‌లో తనిఖీలు చేపడుతూ తగిన ఆదేశాలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

కెజిహెచ్‌లో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్ : కెజిహెచ్‌లో జరుగుతున్న సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. శుక్రవారం ఉదయం కెజిహెచ్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పలు విభాగాల్లో తనిఖీలు చేపట్టారు. ఒపి గేటు పరిసర ప్రాంతాలను, అత్యవసర శస్త్ర చికిత్సా విభాగాన్ని, గిరిజన సేవా కేంద్రాన్ని, డ్యూటీలో ఉన్న వైద్యుల విశ్రాంతి మిగతా 2లో..

సిఎం విశాఖ పర్యటన రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి విశాఖ పర్యటన రద్దయినట్టు ముఖ్యమంత్రి అదనపు వ్యక్తిగత కార్యదర్శి కె.నాగేశ్వర్‌రెడ్డి శు క్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి సిఎం శనివారం చినముషిడివాడలోని శ్రీ శారదా పీఠానికి రావాల్సి ఉంది. అలాగే సాగరమాల కన్వెన్షన్ హాల్, రుషికొండ ఐటీ పార్క్ ప్రాంతాల్లో జరిగే పలు కార్యక్రమాల్లోనూ, పలువురి శుభకార్యాల్లోనూ పాల్గొనాల్సి ఉంది. అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా సిఎం పర్యటన రద్దయింది. దీనికిగల కారణాలను అధికారులు తెలుపలేదు.

రోడ్డుపై రైతుల బైఠాయింపు

వార్త 5లో...

666వ రోజుకు 'ఉక్కు' జెఎసి దీక్షలు

వార్త 2లో..

కొనసాగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు

వార్త 2లో..



ప్రదర్శనను తిలకించేందుకు తరలివచ్చిన విద్యార్థులు

ఎయులో బిబిసి డాక్యుమెంటరీ ప్రదర్శన

అడ్డుకునేందుకు యత్నించిన ఎబివిపిని తరిమికొట్టిన విద్యార్థులు వార్త మెయిన్‌లో..

ఉక్కు ఉద్యమం.. స్ఫూర్తిదాయకం

◆ పోరాటాలను అవహేళన చేస్తే పాలకులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు
◆ సిఐటియు రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బివి.రాఘవులు



మాట్లాడుతున్న బివి.రాఘవులు, వేదికపై లోకనాథం, జగ్గునాయుడు తదితరులు

ప్రజాశక్తి - ఉక్కునగరం

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రెండేళ్లుగా విశాఖలో జరుగుతున్న ఉక్కు ఉద్యమం.. దేశానికే స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని సిఐటియు రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బివి.రాఘవులు అన్నారు. శుక్రవారం ఉక్కునగరంలోని సిఐటియు కార్యాలయంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ అధ్యక్షతన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన రాఘవులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై జరుగుతున్న పోరాటాలను అవహేళన చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వ వ్యతిరేకతపై పోరాడుతున్న వారిలో మత విద్వేషాలను సృష్టించడం, ఐక్యతకు విఘాతం చేసే విధంగా కృషి చేయడం, ఉద్యమాలను బలహీనపరిచే విధంగా కుట్రలు, కుతంత్రాలకు దిగడం, తద్వారా ప్రజాధనాన్ని కార్పొరేట్ శక్తులకు ధారపోయడం కేంద్ర ప్రభుత్వ విధానమని వివరించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

తణుకు టిడిఆర్, విశాఖపట్నంలో లేదని చెబుతుండడం విశేషం. వీటికి ఎలా అనుమతులిచ్చారో అంతుపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక టిడిపి కార్పొరేటర్ ముక్క శ్రావణి అక్రమ నిర్మాణాలపై జివిఎంసి కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా.. కనీసం అటువైపు కన్నెత్తి చూడడం లేదంటే ఈ వ్యవహారంలో అధికారులు ఎంత ఉదాసీనత చూపుతున్నారో స్పష్టమౌతోందని పలువురు అంటున్నారు. దీనిపై జివిఎంసి మూడో జోన్ టిపిఎస్ తేజను వివరణ కోరగా అనధికార నిర్మాణాలను ఇప్పటికే కొన్నింటిని గుర్తించామని, మిగిలిన వాటిపై కూడా పరిశీలన జరిపి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఉక్కు ఉద్యమం.. స్ఫూర్తిదాయకం

దేశ పరిశ్రమల రక్షణ ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ స్ఫూర్తితో దేశవ్యాప్త రాజకీయ ఉద్యమాల ద్వారా కేంద్రానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సిఐటియు సీనియర్ నాయకులు కె.లోకనాథం మాట్లాడుతూ రాష్ట్రంలోనే అనేక మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం అనుసరిస్తున్న విధానం అత్యంత దుర్మార్గంగా ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ ఐక్యంగా ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయవలసిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. దీనికి ప్రధాన భూమికగా ఈ నెల 30న జరుగుతున్న ప్రజాగర్జన నిలువనుందని, దీన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి కన్వీనర్ ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ఉక్కు ప్రజా గర్జనపై పరిశ్రమల్లోనూ, జనావాసాల్లోనూ విస్తృత ప్రచారం జరుగుతోందన్నారు. మోడీ సర్కారు ఉక్కు ప్రైవేటీకరణను విరమించుకునేంత వరకూ పోరాటం సాగుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎన్.రామారావు, స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, నాయకులు బి.అప్పారావు, గంగాధర్, యు.వెంకటేశ్వర్లు, టివికె.రాజు, కెవి.సత్యనారాయణ, మరిడయ్య, నీలకంఠం, ఒవి.రావు, బిఎన్.మధుసూదన్, కె.సత్యనారాయణ, డిసిహెచ్.వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, సూర్యనారాయణ తదితరులతో పాటు వివిధ విభాగాల కార్యదర్శులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో కలెక్టర్ తనిఖీలు

గదులను, దంత వైద్య విభాగాన్ని, ఔషధ నిల్వల స్టోరు రూమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒపి విభాగం ప్రధాన ద్వారం దగ్గర జరుగుతున్న పార్కు సుందరీకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. అదే విధంగా ప్రజా మరుగుదొడ్లను పరిశీలించి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. మంచినీటి ప్లాంట్‌ను తనిఖీ చేసి పక్కనే ఉన్న మురుగునీటి కాలువలపై పలకలను ఏర్పాటు చేయాలన్నారు. రోగులతో పాటు వచ్చే సహాయకులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఉండేలా విశ్రాంతి గదులను తీర్చిదిద్దాలన్నారు. అత్యవసర శస్త్ర చికిత్సా గదులలో అవసరమైన చోట ఎసిలను ఏర్పాటు చేసి రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. విధులలో ఉన్న డాక్టర్లు అవసరమైన సమయంలో విశ్రాంతి తీసుకొనేందుకు ఆధునీకరించిన డాక్టర్స్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం దంత వైద్య విభాగాన్ని పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఒపి రశీదుల విభాగాన్ని పరిశీలించి రోగులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఆధునీకరించడంతో పాటు వాహనాల పార్కింగ్, రోడ్డు నూతనంగా వేయాలని అన్నారు. ఒపి వద్ద ఉన్న గోడకు పెయింటింగ్ వేయించాలని, ప్రవేశ ముఖ ద్వారాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని అన్నారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్, ఆర్ఎంఒ వాసుదేవరావు, వివిధ విభాగాల డాక్టర్లు, ఎపిఎంఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వీయ అభ్యసన అవసరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యార్థులు స్వీయ అభ్యసనం అలవరచుకోవాలని ఎయు వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాద రెడ్డి సూచించారు. శుక్రవారం ఉదయం వర్సిటీ సైకాలజీ విభాగంలో నిర్వహించిన 'నేషనల్ సెమినార్ ఆన్ రోల్ ఆఫ్ ఫోరెన్సిక్ సైకాలజిస్ట్ ఇన్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన అంశాలను అభ్యసించే మనస్తత్వాన్ని కలిగి ఉండాలన్నారు. ఇతరుల భావాలను గుర్తించే సామర్థ్యం సైకాలజిస్టుకు అవసరమన్నారు. సిబిఐ ఎసిబి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆర్.మురళి, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎంవిఆర్.రాజు సదస్సు ప్రాముఖ్యతను వివరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు సభకు అధ్యక్షత వహించారు.

సిఐ రామారావుకు అభినందనలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : త్రీ టౌన్ సిఐ కోరాడ రామారావుకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాన్ని గురువారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన్ని పలువురు అభినందించారు.

666వ రోజుకు 'ఉక్కు' జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక పోరాటాలు, త్యాగాల ఫలితంగా ప్రభుత్వ రంగంలో విశాఖలో ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్ ఉత్తరాంధ్రకే కాకుండా ఆంధ్రప్రదేశ్‌కే గర్వకారణమని ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 666వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎఐటియుసి కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ.5 వేల కోట్ల పెట్టుబడితో విశాఖలో స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసిందని, కార్మికుల శ్రమతో ఈ కర్మాగారం దినదినాభివృద్ధి చెంది కేంద్ర ప్రభుత్వానికి వివిధ రకాల పన్నుల రూపంలో రూ.55 వేల కోట్లను చెల్లించిందని తెలిపారు. ప్రభుత్వాలకు ఇంత భారీ స్థాయిలో ఆదాయం సమకూర్చే పరిశ్రమ దేశంలో మరొకటి లేదన్నారు. అలాగే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్షా 50 వేల మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. రూ.3 లక్షల కోట్ల విలువైన ఆస్తులు కలిగిన ఈ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు కారు చౌకగా అమ్మివేయాలని కేంద్రం నిర్ణయించడం దుర్మార్గమన్నారు. కేంద్రం చర్యను రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలూ, కార్మిక, ప్రజా సంఘాలూ వ్యతిరేకిస్తున్నాయన్నారు. రెండేళ్లుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం సాగుతోందన్నారు. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరిని మార్చుకోవాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం.మన్మధరావు, నాయకులు సింహాద్రి, ఫణీంద్ర పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న నాయకులు

చట్ట సభల్లో అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్‌లో బిసి కులాలలో బాగా వెనుకబడి ఉన్న విశ్వబ్రాహ్మణ, నాయీ బ్రాహ్మణ, రజక, కుమ్మరి, శాలివాహన సామాజిక తరగతులలో ఒకరికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ఆంధప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు, బిసి కులాల వేదిక చైర్మన్ పావులూరి హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు శివకోటి శ్రీనివాసరావు, బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసాని శంకరరావు, బిసి కులాల ఐక్య వేదిక జనరల్ సెక్రటరీ అన్నవరపు నాగమల్లేశ్వరరావు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.

ఉత్తర కోస్తాలోని ఏలూరు నుంచి ఇచ్ఛాపురం వరకు ఉన్న 68 అసెంబ్లీ స్థానాల్లో ఒక స్థానాన్ని ముస్లింలకు కేటాయించాలని వైసిపి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఉత్తరాంధ్ర ముస్లిం ఫోరం అధ్యక్షులు ప్రొఫెసర్ ఎస్‌ఎం.ఇక్బాల్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోరం కన్వీనర్లు చిస్తీ బాబు, కెఎంసి.బాబు బాయ్, డాక్టర్ క్వాజా రెహమతుల్లాహ్ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లను వేధించిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రెజ్లర్లను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్న డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు, కొంతమంది కోచ్‌లను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని బిఎస్ఎన్ఎల్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ మీనా కుమారి డిమాండ్ చేశారు. శుక్రవారం డాబాగార్డెన్స్‌లోని బిఎస్ఎన్ఎల్ జిల్లా జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇదే డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమ అఖిల భారత వర్కింగ్ ఉమెన్ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన జరుగుతోందని, దానికి మద్దతుగా ఇక్కడ ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పిఇసిహెచ్‌వి.సాగర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ గోపాలకష్ణ, సర్కిల్ కో-ఆర్డినేటర్ బి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పిఎంజె వివాహ ఆభరణాల ప్రదర్శన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రసిద్ధ ఆభరణాల బ్రాండ్ పిఎంజె జ్యూయలర్స్ నగరంలోని నోవాటెల్ వరుణ్ బీచ్‌లో గ్రాండ్ వెడ్డింగ్ జ్యూయలరీ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్టు ఆ సంస్థ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం సిరిపురంలోని పిఎంజె జ్యూయలర్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 28, 29 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో పది వేలకు పైగా మునుపెన్నడూ చూడని హ్యాండీక్రాఫ్ట్ డిజైనింగ్ వెడ్డింగ్ ఆభరణాలను, వజ్రాలు, బంగారు నగలను ప్రదర్శించనున్నామన్నారు. ప్రత్యేకమైన పోల్కా సేకరణతో పాటు వజ్రాలు, బంగారం, సాలిటైర్లతో కూడిన అనేక రకాల డిజైన్లు అందుబాటులో ఉంటాయన్నారు. సాంప్రదాయ నమూనాల నుంచి ఆధునిక రోజువారీ లైట్‌వేర్ క్రియేషన్స్ వరకూ ప్రత్యేక వివాహ ఆభరణాలు లభిస్తాయన్నారు.

కొనసాగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు కొనసాగుతోంది. శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఫిజిక్స్‌లో 81 మంది, గణితంలో 156 మంది ఉపాధ్యాయులను వివిధ పాఠశాలలకు సర్దుబాటు చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ నేతృత్వంలో జరుగుతున్న టీచర్ల సర్దుబాటులో పలు ఉపాధ్యాయ సంఘాలు నాయకులు పాల్గొన్నారు. గురువారం సాంఘికశాస్త్రం, ఇంగ్లీష్, బయాలజీలో 216 మంది స్కూల్ అసిస్టెంట్లను సర్దుబాటు చేశారు. శనివారం హిందీ, తెలుగు ఉపాధ్యాయులను స్కూల్ అసిస్టెంట్ల కేటగిరీల్లో సర్దుబాటు చేయనున్నారు. మరో 22 మంది సెకెండరీ గ్రేడ్ టీచర్లకు ఇంగ్లీష్, బయోలజీలో స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ కల్పించి సర్దుబాటు చేయనున్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెజిహెచ్ క్లాస్ అండ్ క్లాస్ 4 ఎంప్లాయ్ కో-ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ సంస్థ సభ్యులకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కింగ్ జార్జ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆసుపత్రి ఆవరణలో సొసైటీ ప్రచురించిన కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు నమ్మి అప్పారావు మాట్లాడుతూ కెజిహెచ్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రగతిని వివరించారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT NARSIPATNAM
O.S.13 / 2022

Between :
Sri Chagantipaati Srinivasa Rao ...Plaintiff
And:
Sri Polinati Vijayakumar
& 3 others ...Defendants

SUMMONS

To,
Defendants No.1 and 3:
1. Sri Polinati Vijayakumar
S/o. Late Polinati Somasundaram, aged about 79 years, Plot No. 8/118, L.B.Colony, Sector-8, M.V.P.Colony, Visakhapatnam District, Aadhar No & Cell No. Not Known to the petitioner
2. Sri Polinati Solomon Raju, S/o. Late Polinati Somasundaram, aged about 61 years, Aadhar No & Cell No. Not known to the plaintiff Rep.by his G.P.A.Holder, Sri Polinati Prasad @ Prasada Rao, aged about 56 years, Plot No. 8/118, L.B.Colony, Sector-8, M.V.P.Colony Visakhapatnam District, Aadhar No & Cell No. Not Known to the petitioner

Whereas the above plaintiff has filed the above suit against you and two others for the reliefs mentioned therein. Where as it is found to the satisfaction of Honourable Court that you hav been evading consistently the receipt of summons in the above proceedings. Hence, the Honourable Court was pleased to direct substitute service of summons to you by way of publication in this newspaper.

Take notice that in the above proceedings you are hereby directed to appear before the Honourable Senior Civil Judge Court, Narsipatnam on **06-02-2023 at 10-30 A.M**. either in person or through an advocate failing which the hearing will take place in your absence.

(By Order of the Hon'ble Court)
TATAVARTHY LAW CHAMBERS (TLC)
T.V.S.K.KANAKA RAJU
M.A.S.PRABHA,
Advocates, Visakhapatnam,

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT NARSIPATNAM
I.A. 206 / 2022 in O.S.13 / 2022

Between :
Sri Chagantipaati Srinivasa Rao ...Petitioner
And:
Sri Polinati Vijayakumar
& 3 others ...Respondents

NOTICE

To,
Respondents No.1 and 3:
1. Sri Polinati Vijayakumar
S/o. Late Polinati Somasundaram, aged about 79 years, Plot No.8/118, L.B.Colony, Sector-8, M.V.P.Colony, Visakhapatnam District, Aadhar No & Cell No. Not Known to the petitioner
2. Sri Polinati Solomon Raju, S/o. Late Polinati Somasundaram, aged about 61 years, Aadhar No & Cell No. Not known to the plaintiff Rep.by his G.P.A.Holder, Sri Polinati Prasad @ Prasada Rao, aged about 56 years, Plot No. 8/118, L.B.Colony, Sector-8, M.V.P.Colony Visakhapatnam District, Aadhar No & Cell No. Not Known to the petitioner

Whereas the above petitioner has filed the above I.A.against you and two others for the reliefs mentioned therein. Where as it is found to the satisfaction of Honourable Court that you hav been evading consistently the receipt of summons in the above proceedings. Hence, the Honourable Court was pleased to direct substitute service of summons to you by way of publication in this newspaper.

Take notice that in the above proceedings you are hereby directed to appear before the Honourable Senior Civil Judge Court, Narsipatnam on **06-02-2023 at 10-30 A.M.** either in person or through an advocate failing which the hearing will take place in your absence.

(By Order of the Hon'ble Court)
TATAVARTHY LAW CHAMBERS (TLC)
T.V.S.K.KANAKA RAJU
M.A.S.PRABHA,
Advocates, Visakhapatnam,

CHANGE OF NAME

I Prem Prakash Kalwani (old name) S/o.P.Khushal Das Kalwani (late) residing at D.No:45-57-2/6, Narasimha Nagar, Visakhapatnam-530024. AP Shall henceforth be known and called as
PREM KALWANI

IN THE HON'BLE COURT OF THE VI ADDL. SENIOR CIVIL JUDGE, AT: VISAKHAPATNAM
O.S.24/2022

Between :
Sri Dadi Babu Rao ...Plaintiff
And:
Sri Kuramdas Appa Rao
& 9 others ...Defendants

SUMMONS

To,
Defendant No.10:
Smt. Seera Adilakshmi,
W/o. Sattibabu,
R/at C/o. Sathivada Suribabu,
D.No.4-58, Sathivanipalem Village, Jaggayyapalem Post,
Pendurthi Mandal,
Visakhapatnam-530012.

Please take notice, the above named plaintiff filed the above suit against you for ejecting you from the suit schedule property and for recovery possession. The above matter is stands posted to **09-02-2023** for your appearance either in person or through your counsel before the Hon'ble Court on **09-02-2023** at **10:30 A.M.,** failing which the matter will be decided accordingly in your absence.

(By Order of the Hon'ble Court)
GORLE PRASAD
B. VASANTHA RAO
Advocates, Gopalapatnam, Visakhapatnam,
Cell :9948689990

ఐఒసిఎల్ నిధులతో కంబాల కొండ అభివృద్ధి


ఒప్పందపత్రాలపై సంతకాలు చేస్తున్న అటవీ, ఐఒసిఎల్ అధికారులు

రూ.90లక్షల సిఎస్ఆర్‌తో జీవవైవిధ్య కేంద్రం ఏర్పాటు
అటవీ, ఐఒసిఎల్ అధికారుల మధ్య కుదిరిన ఒప్పందం

ప్రజాశక్తి - ఆరిలోవ : కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యంలో తూర్పు కనుమలలో జీవవైవిధ్య కేంద్రం ఏర్పాటుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఒసిఎల్) కార్పొరేట్ ఎన్విరాన్‌మెంటల్ రెస్పాన్సిబిలిటి (సిఎస్ఆర్)లో భాగంగా రూ.90 లక్షలను అందజేసింది. శుక్రవారం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల సమావేశ మందిరంలో ఐఒసిఎల్‌కు, విశాఖపట్నం అటవీ డివిజన్ మధ్య ఈ మేరకు ఒప్పందం కుదిరింది. ఐఒసిఎల్ సిఎస్ఆర్ నిధులతో కంబాలకొండలో ఆర్కిడేరియం, ఔషధ మొక్కల తోట, హెర్బల్ గార్డెన్, ప్రకృతి వివరణ కేంద్రం వంటి వాటిని అభివృద్ధి చేయనున్నారు.

. ఈ సందర్భంగా డిఎఫ్ఒ అనంత శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకైక పర్యావరణ పర్యాటక సముదాయం ఏర్పాటుకు నిధులు కేటాయించిన ఐఒసిఎల్‌కు కృతజతలు తెలిపారు. రాబోయే మూడు నెలల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో పనులను పూర్తి చేయాలని యోచిస్తున్నట్టు తెలిపారు. కంబాల కొండలో జీవ వైవిధ్య కేంద్రం సందర్శకులకు ప్రధాన ఆకర్షణ కానుందని తెలిపారు. ఐఒసిఎల్ సౌత్ ఈస్టర్న్ రీజియన్ పైప్‌లైన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, అడవుల పరిరక్షణలో తమ సంస్థ సహకారం, భాగస్వామ్యం కావడం, అటవీశాఖతో కలిసి పనిచేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఐఒసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.పట్నాయక్, సబ్ డిఎఫ్ఒ ధర్మ రక్షిత్, రామ్ నరేష్ , అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు, రేపు తాగునీటి సరఫరా బంద్

ప్రజాశక్తి -భీమునిపట్నం : తాగునీటి పైపులైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 28,29 తేదీల్లో భీమిలి ప్రాంత ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిపేస్తున్నట్లు భీమిలి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తగరపువలస నుంచి భీమిలి మధ్యలో 450 కెఎల్, 800 కెఎల్ రిజర్వాయర్లుకు నీటిని పంపింగ్ చేసే జిఆర్‌పి పైపులైన్లకు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో రెండురోజుల పాటు కుళాయిల ద్వారా నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అయితే ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.


స్నేహపురి కాలనీ అభివృద్ధికి కృషి
72వ వార్డు కార్పొరేటర్ స్టాలిన్



మాట్లాడుతున్న అసోయేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్

ప్రజాశక్తి- గాజువాక : స్నేహపురి కాలనీ అభివృద్ధికి కషి చేస్తానని 72వ వార్డు కార్పొరేటర్ ఎజె స్టాలిన్ అన్నారు. శుక్రవారం స్నేహపురి రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 11వ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ, స్నేహపురి కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రహదారుల పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. వార్యా నివాస్ గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.రమేష్‌కుమార్ మాట్లాడుతూ, స్నేహపురి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పరిసరాల పరిశుభ్రత, కాలనీవాసులు, ముఖ్యంగా పిల్లలు ఆరోగ్యం పట్ల ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత తీసుకోవాలని కోరారు. వాయిస్ ఆఫ్ గాజువాక అధ్యక్షులు టవి. నాగేశ్వరరావు మాట్లాడుతూ, గంగవరం పోర్ట్ లారీల రాకపోకలతో రోడ్లన్నీ శిథిలమయ్యాయని, లారీల్లో తరలిస్తున్న బొగ్గు వల్ల వెలువడే కాలుష్యంతో ప్రజలకు తీవ్ర నష్టం, ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా పూర్వ పాలకవర్గం నివేదికను వెల్లడించారు. భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై తీర్మానించారు. అసోసియేషన్ అధ్యక్షులు పివైవి రమణారావు, కార్యదర్శి కె. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

50వ వార్డులో గడపగడపకూ...


ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును వివరిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి -సీతమ్మధార : జివిఎంసి 50వ వార్డు వుడాకాలనీ-2 మాధవధార, తెన్నేటినగర్, మురళీనగర్, మాన్యం ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కె.కె రాజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. అర్హులై ఉండి పథకాలకు నోచుకోని వారెవరైనా ఉన్నారా అని వాకబు చేశారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను సిఎం జగన్ ప్రజలకు చేరువ చేశారన్నారు. పథకాలకు నోచుకోని అర్హులుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.డైరెక్టర్స్ రాయుడు శ్రీను, రమేష్, ప్రసూనా రెడ్డి, 50వ వార్డు నేతలు, అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు

ప్రజాశక్తి - పద్మనాభం :మండల కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు సంక్షేమ పక్షోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వెటర్నరీ డాక్టర్ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 126 మేకలు, గొర్రెలకు పివిఆర్ టీకాలు వేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మూగజీవాలకు మందులు, టీకాలు వేశారు.

యాతవాని చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని వెంకటాపురం గ్రామంలోని యాతవాని చెరువు దురాక్రమణ, అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలోని సర్వే నెంబరు 73/2లో ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో యాతవాని చెరువు ఉండగా. ఈ చెరువు గర్భంలోని ఐదు ఎకరాల భూమిని గ్రామానికి చెందిన పలుకుబడి ఉన్న వ్యక్తి తన పేరిట నమోదు చేయించుకుని, '1బీ'లోనూ పేర్లు మార్చుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. దీనిపై గ్రామానికి చెందిన మహిళ ఈనెల 9న జిల్లకలెక్టరేట్ స్పందనలోనూ ఫిర్యాదు చేసిందన్నారు. రెవెన్యూ అధికారుల సహకారం లేకుండా ఇంతటి అక్రమాలకు ఆస్కారం ఉండదని, దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి, సమగ్ర సర్వే నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. చెరువుకు ఫీడింగ్ వర్షాధారమే అయినప్పటికీ, దీని కింద 30ఎకరాల భూమి ఆయకట్టుగా కూడాఉందన్నారు. అంతేకాక


సమావేశంలో పాల్గొన్న రైతులు

2008 నుంచి ఈ చెరువలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు విచారణ జరిపి, చెరువు ఆక్రమణ, అక్రమాలపై నిగ్గు తేల్చాలని, లేకుంటే చెరువు పరిరక్షణకు తహశీల్దార్, కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు కోన రమణ, సూరప్పడు, అప్పలనాయుడు, కర్రి రమణ రైతులు పాల్గొన్నారు.

జి-20 సదస్సు నిర్వహణకు నిధులెక్కడివి?
కలెక్టర్, జివిఎంసి కమిషనర్‌ను ప్రశ్నించిన మూర్తియాదవ్

ప్రజాశక్తి- సీతమ్మధార : మార్చి 28, 29 తేదీల్లో విశాఖలో జి-20 సదస్సు నిర్వహణకు రూ.150 కోట్ల నిధులను ఎక్కడి నుంచి తీసుకొచ్చి ఖర్చు చేస్తున్నారో జిల్లా కలెక్టర్, జివిఎంసి కమిషనర్ వెల్లడించాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామంటూ, జి 20 సదస్సు పేరుతో జరుగుతున్న దోపిడీ, అవకవతవకలపై ప్రధాని మోడీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సదస్సుకు నగర సుందరీకరణ పేరుతో చెట్ల నరికివేత, బీచ్‌లో ఇసుక దిబ్బల తొలగింపు, మూగజీవాల వధ వంటి దుర్మార్గపు చర్యలు చేపడుతున్నారన్నారు. సిఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి అప్పుఘర్ తీర ప్రాంతంలో పనులు చేస్తున్నారన్నారు. ఈవెంట్ల పేరుతో నగరవాసులు చెల్లించిన పన్నుల సొమ్ములను దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. సదస్సు నిర్వహణపై జివిఎంసి కౌన్సిల్ సభ్యులతో చర్చించకుండా ఏకపక్షంగా కమిషనర్ రాజబాబు నిర్ణయం తీసుకొని రూ.120 కోట్లు, రూ.70 కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రకటించడం సరికాదన్నారు. వచ్చేనెల 1న నిర్వహించనున్న జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో ఎజెండాలో జి-20 సదస్సు నిర్వహణ అంశం లేకపోవడం దారుణమన్నారు. జనసేన నాయకులు శ్రీనివాస పట్నాయక్, కె.రూప పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపునకు ముందు, తర్వాత శంకరమఠం రోడ్డు

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి మూడో జోన్ పరిధిలోని శంకరమఠం రోడ్డు నుంచి హైవే వరకు ఫుట్‌పాత్‌పై ఉన్న తోపుడుబళ్లు, ఇతర ఆక్రమణలతోపాటు ఫ్లెక్సీలను జివిఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం తొలగించారు. జివిఎంసి ప్రధాన కమిషనర్ రాజాబాబు ఆదేశాల మేరకు ఫుట్‌పాత్ ఆక్రమణలు, తోపుడుబళ్లను తొలగించినట్లు జోన్-3 టిపిఎస్‌తేజ తెలిపారు.ఫుట్‌పాత్‌లను ఆక్రమించి, రాకపోకలకు ఇబ్బందులు కలిగించడం సరికాదన్నారు. తొలగించిన దుకాణాల స్థానే మళ్లీ ఏర్పాటు చేస్తే జివిఎంసి ద్వారా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జివిఎంసి టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా అర్బన్ తహశీల్దార్ కార్యాలయం
అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు


ఆకర్షణీయంగా ఉన్న తహశీల్దార్ కార్యాలయం

ప్రజాశక్తి - సీతమ్మధార: అర్బన్ తహశీల్దార్ కార్యాలయాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నట్లు తహశీల్దార్ శ్యాంప్రసాద్ తెలిపారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని తహశీల్దార్ కార్యాలయానికి వివిధ పనులపై వచ్చేవారికి అసౌకర్యం, ఇబ్బంది కలగకుండా అవసరమైన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కార్యాలయం ఆవరణలో, చుట్టుపక్కలా పచ్చదనం పెంపొందించే లక్ష్యంలో వివిధ రకాల మొక్కలు నాటారు. వివిధ పనులపై వచ్చేవారు కూర్చేనేందుకు వీలుగా సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేస్తున్నారు. మరుగుదొడ్లుకు మరమ్మతులు చేపట్టి, రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించడంతోపాటు వాటిని తరచూ శుభ్రపరిచేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజల వాహనాల పార్కింగ్‌కు అనువుగా పిచ్చిమొక్కలు తొలగించి, చదునుచేసి పార్కింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. నిరంతరం తాగునీటి సదుపాయం అందుబాటులో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకున్నారు. వీటన్నింటికీ తోడు కార్యాలయానికి అనేక పనులపై వచ్చి వారిపట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి పనులను సకాలంలో చేయడం, సమస్యలను సత్వరం పరిష్కరించేలా సిబ్బందికి ఆదేశాలిచ్చినట్లు తహశీల్దార్ వెల్లడించారు. అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో అసౌకర్యాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో, వారి ఆదేశాల మేరకు అవసరమైన సౌకర్యాలను కల్పించినట్లు తహశీల్దార్ శ్యాంప్రసాద్ తెలిపారు. ప్రజలు ఎటువంటి సమస్య ఉన్నా తనను నేరుగా సంప్రదించవచ్చని తహశీల్దార్ శ్యాంప్రసాద్ సూచించారు.


కార్యాలయం ఆవరణలో గ్రీనరీ


కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న సిమెంట్ బెంచీలు

పన్ను కట్టలేదని చెత్తను తీసుకెళ్లరా..?

- జివిఎంసి తీరుపై పలు అపార్ట్‌మెంట్ వాసుల నిరసన
- సిపిఎం ఆధ్వర్యంలో గాజువాక జోనల్ కార్యాలయం వద్ధ ధర్నా



చెత్త బుట్టలతో తరలివచ్చి, జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అపార్ట్‌మెంట్‌వాసులు, మహిళలు

ప్రజాశక్తి- గాజువాక : పన్ను కట్టలేదని చెత్తను తీసుకెళ్లకపోవడం దుర్మార్గమని, ప్రజారోగ్యానికి, పారిశుధ్యానికి ప్రభుత్వం, అధికారులు ఇచ్చిన ప్రాధాన్యత ఇదేనాయని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గాజువాక జోన్ పరిధిలోని పలు అపార్ట్‌మెంట్లు, కాలనీల నుంచి చెత్త సేకరించకపోవడాన్ని నిరసిస్తూ ఆయా కాలనీ, అపార్టుమెంట్ల వాసులతో కలిసి శుక్రవారం గాజువాక జోనల్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. ఇంటి నుంచి బుట్టల్లో చెత్తను తీసుకొచ్చి, జోనల్ కార్యాలయం వద్ద ప్రదర్శిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, ప్రజలు చెల్లిస్తున్న ఇంటి పన్నులోనే తాగునీరు, గ్రంథాలయం, పారిశుధ్యం, ఇలా అన్ని పన్నులు కలిసి ఉంటాయన్నారు. అలాంటప్పుడు వేరేగా చెత్త కోసం ప్రజలు పన్ను ఎందుకు చెల్లించాలని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలోని ఒక్కో అపార్టుమెంట్ నుంచి ఏడాదికి సగటున రూ.15లక్షల వరకు ఇంటి పన్ను చెల్లిస్తున్నారని, వాటిలోనే చెత్త సేకరణ పన్ను కూడా ఉంటుందన్న విషయం ప్రభుత్వం, అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు చెత్తకోసం వేరేగా పన్ను చెల్లించాలని ఒత్తిడి చేయడం, కట్టలేదని చెత్తను తీసుకెళ్లకపోవడం దుర్మార్గమన్నారు. ఇటీవల రోడ్డు అభివృద్ధి, క్లాప్ వాహనాలకు అంటూ వేరేగా పన్నులు కూడా వేస్తున్నారన్నారు. చెత్త తీసుకెళ్లక పోవడంతో పారిశుధ్యం క్షీణించి దోమలు, ఈగలు విజృంభించి ప్రజలు రోగాల బారిన పడితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని రాంబాబు ప్రశ్నించారు. గంగవరం పోర్టు దుమ్ము, ధూళి కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారి నుంచి వేరేగా పన్నులు ఎందుకు కట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్పొరేట్ కంపెనీలు, బడాబాబులకు ఒక నిబంధన, సామాన్యులకు వేరే రూల్ ఉంటుందాయని నిలదీశారు. ఇలా చెత్తను తీసుకెళ్లకపోతే స్వచ్ఛభారత్‌లో విశాఖకు మంచి ర్యాంకు ఎలా వస్తుందో చెప్పాలన్నారు. తక్షణమే జివిఎంసి యంత్రాంగం స్పందించి తగు చర్యలు చేపట్టకుంటే, తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ధర్నాలో సమైక్య అపార్ట్‌మెంట్ నాయకులు తవిటయ్య, ఎంవి రమణ, తవుడన్న, సిరియా అపార్ట్‌మెంట్ ప్రతినిధులు వై మాధవి, ఇ.బాలు గ్రీన్‌లైఫ్ జమిందార్ డి.అప్పారావు, ప్లాజా అపార్ట్‌మెంట్ ప్రతినిధి రామలక్ష్మి, వార్వా నివాస్ చైర్మన్ బిఎ. శ్రీనాథ్‌స్వామి, స్వతంత్రనగర్ కాలనీ నాయకులు జి లక్ష్మి ,ఎం శ్రీదేవి,, దిబ్బపాలెం కాలనీ నాయకులు పి నాగేశ్వరరావు, దత్త సాయినగర్ నాయకులు వెంకటరావు, అక్కిరెడ్డిపాలెం వార్వా నివాస్ కార్యదర్శి డి.అప్పారావు తదితరులు ధర్నాకు నేతృత్వం వహించారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గురుమూర్తిరెడ్డి, చంద్రశేఖర్

ప్రజాశక్తి గాజువాక : శ్రీ వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆధ్వర్యంలో వికాస్‌నగర్‌లో రహదారి భద్రత, ట్రాఫిక్ నియమ, నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, ట్రాఫిక్ ఎఎస్ఐ చంద్రశేఖర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'వేగం వద్దు ప్రాణం ముద్దు' రహదారి భద్రతా నియమాలే ప్రాణాలకు రక్ష నినాదాలతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ చంద్రశేఖర్, ప్రిన్సిపల్ రాధిక పాల్గొన్నారు.

విద్యార్థిని దివ్యకు కలెక్టర్ ప్రశంస


కలెక్టర్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న దివ్య

ప్రజాశక్తి భీమునిపట్నం : జివిఎంసి రెండో వార్డు రాయిపాలెం ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని దివ్య ప్రతిభను గుర్తించిన జిల్లా కలెక్టర్ మల్లికార్జున సర్టిఫికేట్ అందజేసి అభినందించారు.ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో జిల్లాస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచిన దివ్యను కలెక్టర్ అభినందించారు. తమ పాఠశాల విద్యార్థిని దివ్య, జిల్లా కలెక్టర్ ప్రశంసలు అందుకోవడం సంతోషంగా ఉందని హెచ్ఎం జె రాధాకుమారి, ఉపాధ్యాయిని శైలజ తెలిపారు.

'స్వచ్ఛ సంకల్ప్'పై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు బోయి వీధిలో శుక్ర వారం స్వచ్ఛసంకల్ప్ కార్యక్రమం నిర్వహించారు. జివిఎంసి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము పాల్గొని తడి, పొడిచెత్త సేకరణ, ఇంటి ముంగిట‌ుకు వచ్చే క్లాప్ వాహనానికి అందజేతపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో. వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ తది తరులు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎండాడ పాఠశాల విద్యార్థులు


రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులకు హెచ్‌ఎం, పిఇటి అభినందన

ప్రజాశక్తి -మధురవాడ : స్కూల్ గేమ్స్‌లో భాగంగా రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎండాడ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు తెలిపారు. గతనెల 31న నర్సీపట్నం, వేములపూడి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో మంచి ప్రతిభను కనబరిచిన తమ పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర పోటీలకు ఎంపిక కావడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈనెల 28, 29, 30వ తేదీల్లో కాకినాడలో జరగబోవు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణరావు ఉన్నారు.

సబ్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

సిఐటియు ఆధ్వర్యాన హెచ్‌పిసిఎల్ గేట్ వద్ద ధర్నా



హెచ్‌పిసిఎల్ గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -ములగాడ : కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్న జోబి కాంట్రాక్టర్‌పై హెచ్‌పిసిఎల్ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కంపెనీ గేట్ వద్ద శుక్రవారం సిఐటియు ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతు హెచ్‌పిసిఎల్ విస్తరణ పనుల్లో భాగంగా పెట్రో పేక్ సంస్థ వద్ద సబ్ కాంట్రాక్ట్ పనులు తీసుకున్న జోబి అనే కాంట్రాక్టర్ తీరుపై మండిపడ్డారు. కార్మికులకు నిబంధనల ప్రకారం వేతనాలను సక్రమంగా చెల్లించడం లేదని, స్కిల్డ్ వర్కర్స్‌కు సైతం అన్‌స్కిల్డ్ కార్మికుల మాదిరిగా వేతనాలు చెల్లిస్తున్నారని, రోజూ 12గంటలు పనిచేయిస్తూ కార్మికుల శ్రమన దోపిడి చేస్తున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అదనపు గంటలు పనిచేస్తే వారికి ఓవర్‌టైమ్ పేమెంట్లు చెల్లించడం లేదన్నారు. కార్మికులను ఇష్టారాజ్యంగా అక్రమంగా తొలగించడమే కాకుండా,వారికి ఎటువంటి సెటిల్మెంట్లు చేయడం లేదన్నారు. దీనిపై హెచ్‌పిసిఎల్ యాజమాన్యం స్పందించి తగు చర్యలు చేపట్టకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టర్ వర్కర్స్‌యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.కృష్ణారావు, జనరల్ సెక్రెటరీ జి.నరేష్ కార్మికులు దినేష్, రామ్‌కుమార్, సంతోష్ మహతో, శ్యామ్‌లాల్ కుమార్, సోనీ కుమార్ పాల్గొన్నారు.

ఉక్కు ప్రజాగర్జనను జయప్రదం చేయాలని

గాజువాకలో అఖిలపక్షం భారీ ర్యాలీ

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 30న ఉక్కునగరం, తప్ష గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఉక్కు ప్రజాగర్జన జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి గాజువాక వర్తక సంఘం ప్రతినిధులు, తోపుడు బళ్లు, ఇతర వర్తకులు మద్దతు పలికి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తక్షణమే విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గి, ఉపసంహరించుకునే ప్రకటన చేసే వరకు పోరాటాలు కొనసాగిద్దామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో సిపిఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఉక్కు పరిరక్షణ



ర్యాలీలో పాల్గొన్న అఖిలపక్ష పార్టీల నేతలు

పోరాట కమిటీ కోకన్వీనర్ అయోధ్యరాం మాట్లాడుతూ, రూ.లక్షల కోట్లు విలువ చేసే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కార్పొరేట్లు, ప్రయివేటు కంపెనీలకు అమ్మాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. పోరాట కమిటీ నాయకులు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, సిఐటియు నేతలు ఎన్.రామారావు, స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి ఈ రామస్వామి, టిడిపి నాయకులు ప్రసాద్, శ్రీనివాస్, కాంగ్రెస్ నేత అచ్చిబాబు పాల్గొన్నారు.

830 మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు



గ్యాస్ సిలిండర్లు, స్టవ్‌లు పంపిణీ చేస్తున్న ముత్తంశెట్టి

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గంభీరం పంచాయతీలో 830మంది పేదలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లను శుక్రవారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీలకతీతంగా సీఎం జగన్మోహనరెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. గంభీరం పంచాయతీ సర్పంచ్‌గా విపక్ష టిడిపికి చెందిన అభ్యర్థి గెలిచినప్పటికీ, గడచిన మూడేళ్లలో 1400 కుటుంబాలకు అభివృద్ధి కింద రూ.5.75కోట్లు, సంక్షేమానికి రూ.12కోట్లు వెచ్చించామన్నారు. జగనన్న కాలనీల్లో 356మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. తన నియోజకవర్గంలో అర్హులకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చడంతో అధికారులుగానీ, ఇంకెవరైనా నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు కార్యక్రమంలో ఎంపిపి పాండ్రంకి శ్రీను, బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, ఎంపిడిఒ లవరాజు పాల్గొన్నారు

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

ప్రజాశక్తి-భీమునిపట్నం : ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో రాష్ట్ర భాష, విశారద, ప్రవీణ, మధ్యమలో ఉచిత శిక్షణ పొంది, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు శుక్రవారం జివిఎంసి, పిఎన్ఎం హైస్కూల్‌లో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు, గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులకు హిందీ సర్టిఫికెట్లు ఇస్తున్న నూకరాజు

రోడ్డుపై రైతుల బైఠాయింపు

పిఎసిఎస్‌ల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని

ప్రజాశక్తి -మునగపాక రూరల్

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రైతుల రోడ్డు ఎక్కారు. ధాన్యం మూటలు రోడ్డుపై వేసి బైఠాయించారు. ధాన్యం కొనుగోలు తక్షణం చేయాలని, రైతులను ఆదుకోవాలని, రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విడనాడాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సమయంలో ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. అయితే వ్యవసాయశాఖ అధికారి వచ్చి ధాన్యం కొనుగోలుపై స్పష్టత ఇచ్చే వరకు ధర్నాను విరమించేది లేదని రైతు నాయకులు తెగేసి చెప్పారు. దీంతో రైతులతో చర్చించాలని వ్యవసాయ అధికారి జోష్నా కుమారిని పోలీసులు కోరడంతో ఆమె రైతులు ధర్నా చేసే ప్రాంతానికి వచ్చి రైతులతో చర్చించారు. పైఅధికారులతో చర్చించి శనివారం నుండి ధాన్యం కొనుగోలు జరిగేలా ప్రయత్నిస్తామని ఆమె హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. దీనికి ముందు రైతు నాయకులు దాడి ముసిలి నాయుడు, ఆడారి మహేష్, ఎస్.బ్రహ్మాజీ మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు జరిగేదని, తద్వారా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేదని తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం రైతులను ఆదుకుంటున్నామని ఆర్భాటాలు చేసిన ముఖ్యమంత్రి, ఆ స్థాయిలో కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో టెక్నికల్ అసిస్టెంట్ ధాన్యం నాణ్యతను పరిశీలించిన తర్వాతనే మిల్లర్లకు తరలిస్తున్నామని, కానీ మిల్లర్లు లేని కారణాలను చూపించి ధాన్యాన్ని తిరిగి పంపించటం ఏమిటని ప్రశ్నించారు. ధాన్యం సేకరణపై ప్రభుత్వం నిర్ణయాత్మకమైన చర్యను తీసుకోకపోతే అన్నదాతలు ఆత్మహత్యలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహన్ రావు, రైతు నాయకులు మల్ల సంజీవరావు, భీమరశెట్టి శ్రీనివాసరావు, మల్ల వరాహ నరసింగరావు, మొల్లేటి సత్యనారాయణ, దాడి శివ, విల్లూరి నూక నరసింహారావు, శరగడం జగన్, ప్రసాద్, టెక్కలి పరశురాం తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై ధాన్యం బస్తాలు ఉంచి బైఠాయించిన రైతులు



నినాదాలు చేస్తున్న నేవీ నిర్వాసితులు

89వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఒబి గేట్ ముందు 8 గ్రామాల నేవీ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన శుక్రవారం నాటికి 89వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నేవీ నిర్వాసిత జెఎసి నాయకులు మాట్లాడుతూ గతంలో శారద, వరాహ నదులలో వేటకు వెళ్లి జీవనోపాధి పొందేవాళ్లమని, ఇప్పుడు నేవీ అధికారులు వేటకు ఆటంకం కల్గించడంతో తాము ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒప్పందం ప్రకారం తమకు జెట్టీ నిర్మించాలని, అప్పటి వరకు ఆధార్ కార్డు ఆధారంగా నేవీ గేట్ గుండా చేపల వేటకు అవకాశం కల్పించాలని కోరారు. 89 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.



షీల్డ్, ప్రశంసా పత్రంతో షర్మిల, పక్కన పాఠశాల ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో షర్మిల ప్రతిభ

ప్రజాశక్తి- దేవరాపల్లి

రాష్ట్రస్థాయి వాలీబాల్ అండర్-17 విభాగంలో మండలంలోని తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఎస్.షర్మిల ద్వితీయ స్థానాన్ని సాధించిందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.ఉమాశంకర్ శుక్రవారం తెలిపారు. విశాఖలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడలు ఈనెల 23వ తేదీ నుంచి25వరకు జరిగాయని, అందులో విశాఖ జిల్లా తరపున పాల్గొన్న షర్మిల గుంటూరు జిల్లా జట్టుతో జరిగిన ఉత్కంఠ పోటీలో ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. షర్మిలను, ఇంత చక్కటి తప్పిదనిచ్చిన పిడి నరసింగరావును పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

మెగా వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

ప్రజాశక్తి-అనకాపల్లి

గవరపాలెం కొణతాల లక్ష్మీనారాయణ, సూర్య కళ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు డాక్టర్ నాగేష్, జగదీష్ ఆధ్వర్యంలో మల్ల జగన్నాథం కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన మెగా కేన్సర్ వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. ఈ శిబిరంలో గొంతు కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్, ఊపిరితిత్తులు, గర్భాశయ పరీక్షలు నిర్వహించారు. అలాగే కేన్సర్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో ఎక్సాస్ స్కాన్ ఆంకాలజిస్టు, ఓమ్ని ఆసుపత్రి వైద్య సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిబిరాలలో సుమారు 450 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 160 మందికి బ్రెస్ట్ కేన్సర్, గొంతు కేన్సర్ కు సంబంధించిన స్కానింగ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, ఓమ్ని ఆసుపత్రి డైరెక్టర్ టి వెంకట రమణారెడ్డి, కార్పొరేటర్ పీలా లక్ష్మి సౌజన్య రాంబాబు, గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల మహాలక్ష్మి నాయుడు, దొడ్డి బోగేష్, బుద్ధ లక్ష్మణ్, పిళ్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గొంతు కేన్సర్ పరీక్షలు చేస్తున్న దృశ్యం



పశువుల మందులు అందజేస్తున్న పశు వైద్యాదికారి అల్పహన్స్ జార్జ్

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-కశింకోట

జంతు సంరక్షణ పక్షోత్సవాలు సందర్భంగా స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం వద్ద శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భ కోస వ్యాధుల పరీక్ష చేసి మందులు ఇచ్చారు. పెయ్యలకు నట్టల నివారణ మందులు, విటమిన్ ఇంజక్షన్ వేయడం జరిగింది. ఈ సందర్భంగా కశింకోట పశు వైద్య అధికారి అల్పహన్స్ జార్జ్ మాట్లాడుతూ పశువులను అప్యాయత చూడాలన్నారు. ప్రతి రైతు సకాలంలో పశు, జంతు సంరక్షణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేటి మారుతి, వెంకటాచారి, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ సిడిపిఒగా మంగతాయారుకు అవార్డు

ప్రజాశక్తి- కె.కోటపాడు


స్థానిక సమీకృత శిశు అభివృద్ధి పథకం (ఐసిడిఎస్) ప్రాజెక్ట్ కార్యాలయం చైల్డ్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ (సిడిపిఒ) వి.మంగతాయారుకు ఉత్తమ సీడీపీఓగా అవార్డు లభించింది. రిపబ్లిక్ డే సందర్భంగా గురువారం జిల్లా కేంద్రం అనకాపల్లిలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ రవిపట్టన్ శెట్టి చేతుల మీదుగా ఆమెకు అవార్డు, ప్రశాంస పత్రం అందజేశారు. ప్రాజెక్టులో శ్లాఘనీయమైన సేవలు అందించినందుకు సీడీపీఓకు కలెక్టర్ మెరిట్ సర్టిఫికేట్ అందచేశారు. సీడీపీఓ మంగతాయారుకు ఉత్తమ అధికారిణిగా అవార్డు రావడంపట్ల ఐసీడీస్ ప్రాజెక్ట్ పలు సెక్టార్ల సూపర్ వైజర్లు రాములమ్మ, కళ్యాణి, సుశీల, ఆదిలక్ష్మి, బిపిఎ వెంకటరావు, అంగన్వాడీ కార్యకర్తలు డోకల కుమారి, ఎం.వరలక్ష్మి, మంగళగిరి లక్ష్మి, గాలి గౌతమి, బండారు సూర్యప్రభ, రమ, చంటి, సాయిలక్ష్మి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



ప్రశంసా పత్రం అందుకుంటున్న మంగతాయారు

జనుము సాగుతో అదనపు ఆదాయం

మినప పంటకు తెగుళ్లతో రైతు దిగాలు



ఏపుగా పెరిగిన జనుము పంట

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

మండలంలోని పలు గ్రామాల్లో జనుము సాగు ముమ్మరంగా చేపట్టి రైతులు అదనపు ఆదాయం పొందుతున్నారు. ఖరీఫ్ వరి పంట కోత దశలో ఉన్నప్పుడు పంట పొలాల్లో జనుము విత్తనాలను చల్లుతారు. అనంతరం వరి పంటను కోత కోసిన కొద్ది కాలానికి జనుము మొలకెత్తుతుంది. తక్కువ ఖర్చుతో రైతులకు లాభాలను ఇచ్చే జనుము సాగును మండలంలోని వడ్డాది, చిన్నప్పన్నపాలెం, రాజాం, బుచ్చయ్యపేట, దిబ్బది, నీలకంఠాపురం తదితర గ్రామాల్లో అధికంగా రైతుల చేపట్టారు. సాధారణంగా ఖరీఫ్ వరి పంటకు ముందు జనుము విత్తనాలు చల్లి ఏపుగా ఎదిగిన తర్వాత దానిని దమ్ములో దున్నుతారు. దీని వల్ల వరి పొలం సారవంతమై అధిక దిగుబడులు రావడానికి ఈ జనుము ఎంతో ఉపయోగపడుతుంది. అయితే కొద్ది సంవత్సరాలుగా మండలంలోని రైతులు జనుము పంటను ఆదాయం పంటగా మార్చుకున్నారు. ఖరీఫ్ అనంతరం వరి పొలాల్లో దీనిని సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వందలాది ఎకరాల్లో జనము పూతదశలో ఉంది. ఎటువంటి పెట్టుబడి లేకుండా పురుగుల మందు బాధ పెద్దగా లేకుండా ఈ పంట పండుతుంది. ఎకరాకు సుమారు రూ.10వేలు వరకు జనుము సాగు వల్ల ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో జనుము రూ.60 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.



మినప పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

మినప పంటకు తెగుళ్లు

ఖరీఫ్ వరి సాగు అనంతర పంట పొలాల్లోనే చల్లే మినప సాగును కూడా మండలంలో వందల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. నెలల రోజుల కితం కోసిన వరి పంట అనంతరం రైతులు మినప విత్తనాలను వరి పొలాలలో చల్లారు. అయితే ఈ ఏడాది మినప సాగుకు తెగుళ్ల బెడద పట్టుకుంది. మినప మొక్కలు పూత తక్కువగా ఉండడం, పూత నిలబడకపోవడం, ఆకు ముడుచుకుపోవడం తదితర కారణాలతో మినప సాగుకు ఆశాజనకంగా లేదని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు మినప పంటపై పురుగుల మందును పిచికారీ చేస్తున్నారు.

పోక్సో కేసులు, స్పందన ఫిర్యాదులపై దృష్టి

- 11న లోక్ అదాలత్‌లో కేసులు తగ్గింపునకు చర్యలు
- ఎస్‌పి గౌతమి శాలి ఆదేశం

ప్రజాశక్తి-అనకాపల్లి

పోక్సో కేసులు, స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ గౌతమి శాలి జిల్లా పోలీస్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన నెలవారి క్రైమ్ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫిబ్రవరి 11న జరిగే లోక్ అదాలత్‌లో దర్యాప్తు పెండింగ్లో ఉన్న కేసుల తగ్గింపునకు కషి చేయాలని సూచించారు. రహదారి ప్రమాదంలో ఒక వ్యక్తి ప్రాణం కోల్పోవడం మాత్రమే కాదని, ఆ కుటుంబం రోడ్డున పడే ప్రమాదం ఉన్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి కారణాలవల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అంగవైకల్యం, ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబాలు ఇతరులపై ఆధార పడాల్సి వస్తోందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రహదారి భద్రత నియమాలు పాటించేలా స్టేషన్ హౌస్ ఆఫీసర్లు చర్యలు చేపట్టాలని సూచించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో లైటింగ్, వేగ నియంత్రణ సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ బి విజయభాస్కర్, డీఎస్పీలు బి సునీల్, పి శ్రీనివాసరావు, మల్ల మహేశ్వరరావు, సిఐలు మోహన్ రావు, చంద్రశేఖర్, లక్ష్మణమూర్తి, అప్పలనాయుడు, పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి గౌతమిశాలి, పాల్గొన్న పోలీసు అధికారులు


అక్కులమ్మ తల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఘనంగా తీర్థ మహోత్సవాలు

ప్రజాశక్తి - పరవాడ

మండల కేంద్రం పరవాడలోని సినిమా హాల్ జంక్షన్‌లో ఉన్న సిరిపురపు వారి పేరంటాలు అక్కులమ్మ తల్లి తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్, వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి పరవాడ 14వ వార్డు సభ్యులు సిరిపురపు రాజేష్, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమరాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కాసు అంజిరెడ్డి, నాయుడు పాలెం సర్పంచ్ కుండ్రాపు వరలక్ష్మి సీతారామయ్య, నాయకులు కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, బండారు రామారావు, ఆలయ కమిటీ సభ్యులు, క్రేజీ బాయ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సాయిబాబా తీర్థం...

కశింకోట : మండలంలోని చింతలపాలెం గ్రామంలో సాయిబాబా తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. ఎంపిపి కలగా లక్ష్మి, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, కొట్టే రాము, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, మండల కో ఆప్షన్ సభ్యులు అద్దంకి సత్యనారాయణ , పలువురు నాయకులు పాల్గొన్నారు.

అడవి రాజులబాబు పండుగ

గొలుగొండ : మండలంలోని చీడిగుమ్మల యర్రవరంలో శుక్రవారం ఘనంగా అడవి రాజులు బాబు పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.


అడవి రాజుల బాబు గుడి వద్ద బారులు తీరిన భక్తులు

అంగన్‌వాడీ కేంద్రానికి సౌకర్యాలు

ప్రజాశక్తి-రావికమతం

కవగుంట అంగన్వాడి కేంద్రానికి మౌలిక సదుపాయాల కల్పనకు అన్ని విధాలుగా కృషి చేస్తానని సర్పంచ్ దాసరి సూర్య కుమారి వరహాలు తెలిపారు. అంగన్వాడి కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు.అంగన్వాడీ కేంద్రానికి కరెంటు, ఫ్యాను, కుర్చీలు లేవని సర్పంచ్‌కు అంగన్వాడి టీచర్ గూడెపు వెంకటలక్ష్మి తెలిపారు. సర్పంచ్ సానుకూ లంగా స్పందించి ఫ్యాన్లు, చైర్స్, ప్రహరీ లోపల మట్టిని సొంత డబ్బులతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రంలో సమస్యలను చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకు వెళ్లి అభివీద్ధికి కృషి చేస్తామన్నారు.

సూర్యనారాయణమూర్తిని దర్శించుకున్న ఎస్‌పి

ప్రజాశక్తి- అనకాపల్లి

మండలంలోని రాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీసూర్యనారాయణమూర్తి స్వామివారిని శుక్రవారం ఎస్పీ గౌతమి శాలి దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొణతాల బాబురావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం రథసప్తమి వేడుకల నేపథ్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ బి భాస్కరరావు, అనకాపల్లి డిఎస్పి బి సునీల్, రూరల్ సీఐ రవికుమార్, ఎసెత్ప నర్సింగరావు ఉన్నారు.

నేడే గవరపాలెం గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ఏర్పాట్లు పూర్తి


విద్యుత్ అలంకరణతో గౌరీ పరమేశ్వరుల ఆలయం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్రలో పేరెన్నికగన్న గవరపాలెం గౌరీ పరమేశ్వరుల మహోత్సవం శనివారం అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. జీవీఎంసీ, ఆర్ అండ్ బి, పోలీస్ శాఖ ఇతర శాఖల సమన్వయంతో ఇబ్బందులు తలెత్తకుండా సుమారు 1000 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవానికి ఉత్తరాంధ్ర వ్యాప్తంగా సుమారు లక్ష మంది రావచ్చని అంచనా వేస్తున్నారు. ఉత్సవ కమిటీ ఎక్కడికక్కడే ప్రసాద వితరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వివిధ ప్రాంతాల్లో 40 స్టేజి ప్రోగ్రాములు ఏర్పాటు చేశారు. అమ్మవారి రథోత్సవం ముందు 20 రకాల నేలవేషాలు ప్రదర్శించనున్నాయి. పట్టణంలో సుమారు మూడు కిలోమీటర్ల మేర విద్యుదాలంకరణ, కటౌట్లు, స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఉత్సవం సందర్భంగా పలుచోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలో అమ్మవారి ఆలయం నుంచి పెద్ద ఎత్తున సారి ఊరేగింపు జరిగింది. పట్టణంలోకి వాహనాలు ప్రవేశించకుండా వివిధ రహదారులకు మళ్లించారు. సుమారు కోటి రూపాయలు ఖర్చుతో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాన్ని తిలకించడానికి పెద్ద ఎత్తున ప్రజలు, బంధువులు, చుట్టాలు దూర ప్రాంతాల నుంచి వస్తున్నారు.

విద్యార్థులతో పనులు చేయించడంపై విమర్శలు

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్

యలమంచిలి మున్సిపాలిటీ 20వ వార్డు పరిధి పెద్దపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేత పనులు చేయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన సమయంలో మంగళవారం పాఠశాల ఆవరణలో ఉన్న కల్వర్టుకు ప్లంబింగ్, సిమెంట్ కాంక్రీట్ పని చేయించడాన్ని స్థానిక యువకులు గమనించారు. దీనిపై కొంతమంది యువకులు పనిచేస్తున్న విద్యార్థులను ప్రశ్నించగా వారు పాఠశాల లోపలికి పరుగులు తీశారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులను బయటకు తీసుకువచ్చి వాళ్లతో మళ్లీ పని చేయించడంతో గ్రామ యువకులు వీడియో తీస్తుండగా, తీసుకొని మీకు నచ్చిన వాళ్లకు చెప్పకొండి అని హెచ్‌ఎం జవాబు ఇచ్చినట్లు సదరు యువకులు ప్రజాశక్తికి తెలియజేశారు. దీనిపై ప్రజాశక్తి ప్రతినిధి ప్రధానోపాధ్యాయుని సంప్రదించగా 'అందులో తప్పు ఏముంది, అది నా సొంత ఇంటి పని కాదుగా' అని సమాధానం ఇచ్చారు. సదరు ప్రధాన ఉపాధ్యాయుడు గతంలో విద్యార్థులతో ఆయన భోజనం చేసిన ప్లేట్లు కూడా కడిగించేవారని స్థానిక యువకులు చెబుతున్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరులతున్నారు.


పాఠశాల ప్రహరి వద్ద పనులు చేస్తున్న విద్యార్థులు


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

అర్హులకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- చోడవరం

అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని అంబేరుపురం గ్రామంలో మూడో రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. గ్రామంలో మహిళలతో సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు ఇంటింటికి ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు కుమారి, బుద్ధ గంగరాజు, స్థానిక వైసీపీ నాయకులు సూరిశెట్టి నాగ గోవిందు, నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉచితంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు

ప్రజాశక్తి పాయకరావుపేట

పాయకరావుపేట అంబేద్కర్ కాలనీ పరివర్తన నిలయంలో సుప్రీంకోర్ట్ న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ చేతుల మీదుగా ఇండేన్ డీకేవీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కేఓ మల్లవరం ఆధ్వర్యంలో ఉజ్వల ఉచిత గ్యాస్ పథకంను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇండేన్ గ్యాస్ ఆయిల్ కార్పొరేషన్ మంజూరు చేస్తున్న ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్ పథకంను లబ్దిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసం పలువురు నమోదు చేసికున్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూషన్ కో పార్టనర్ మార్తి సింహాచలం, నిర్వాహకులు దువ్వాడ దావీదు, జెక్కల సూరిబాబు, బోడపాటి సురేష్, బోడపాటి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలతో అధిక లాభాలు

ప్రజాశక్తి- దేవరాపల్లి

గ్రామాల్లో సేకరించిన తడి పొడి చెత్తను సంపద తయారీ కేంద్రాల్లో నిలువచేసి మంచి ఎరువులు తయారు చేసి సంపద తయారీ కేంద్రంతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా కోఆర్డినేటర్ ఈ.నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలలో ఉన్న సంపద తయారీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. తెనుగుపూడి సంపద కేంద్రాన్ని పరిశీలించి ఏ విధంగా సంపద తయారీ కేంద్రాన్ని అభివృద్ధి చేసుకోవాలో సూచనలు చేశారు. ఈ సంపద తయారీ కేంద్రంలో తయారుచేసిన ఎరువులను రైతులకు విక్రయించే మార్గాల గురించి ఆమె ఆ సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.సంతోషినళిని, ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు, ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టసభల్లో చోటు కల్పించండి

రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు పాపారావు

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:అన్ని రంగాలలో వెనుకబడిన రెల్లిలకు రానున్న 2024 ఎన్నికలలో ఎస్సీ రిజర్వేషన్ స్థానాల్లో చట్టసభల్లో చోటు కల్పించాలని రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు కోరారు. శుక్రవారం నర్సీపట్నం మండలం చెట్టుపల్లిలో డివిజన్ నాయకులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో నిందితులను అరెస్టు చేయడంలో సుప్రీంకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కుతున్నారన్నారు. ఎఫ్ఎస్ఐఆర్ నమోదు చేసిన 24 గంటల్లో దోషులను అరెస్టు చేయాలన్నారు. స్టేషన్ బెయిల్ 41 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని 100 సంవత్సరాల వరకు ప్రత్యేక చట్టం చేయాలని తెలిపారు. ఈ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్యపేట మండల అధ్యక్షులు బొర్ర శ్రీను, వి.మాడుగుల మండలం అధ్యక్షులు డి.శ్రీనివాస్, అలాగే పలు మండలాలకు చెందిన నాయకులు వరహాలు, బంగారి రాజు, దేవుడు, కన్నారావు, బి.రాజు, బి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాపారావు

పశువులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -కోటవురట్ల:పశువులకు సోకే గర్భకోశ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సింహాద్రి అప్పడు సూచించారు. శుక్రవారం ఆయన ఆక్సాహెబ్ పేట గ్రామంలో గర్భకోశ పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎదకురాని పశువులకు వైద్యం అందజేశారు. అదే విధంగా గొర్రెలకు నట్టల నివారణ మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం పశు వైద్యులు పడాల్, పాములవాక పశు వైద్యులు హరిప్రియ పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

లోకేష్ పాదయాత్ర విజయవంతానికి

టిడిపి నేతల పూజలు



కోటవురట్లలో పూజలు చేస్తున్న టిడిపి నేతలు

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలని అనకాపల్లి, విశాఖ జిల్లాలోని పలు చోట్ల టిడిపి నేతలు ఆలయాల్లో పూజలు చేశారు. పలువురు నాయకులు లోకేష్ పాదయాత్రలో నేరుగా పాల్గొన్నారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కోటవురట్ల:తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలని మండల కేంద్రంలో టిడిపి నాయకులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు జానకి శ్రీను మాట్లాడుతూ, లోకేష్ పాదయాత్రతో అధికార పార్టీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడు తున్నాయన్నారు.తెలుగు యువత మండల అధ్యక్షులు తిరుమలరావు మాట్లాడుతూ, లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజుపేట సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ, కోటవురట్ల ఎంపిటిసి పి సూర్యారావు, కసిరెడ్డి ఏసుబాబు, బత్తుల అప్పారావు, సుంకర బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:వేములపూడిలోని వేమాలమ్మ ఆలయంలో టీడీపీ మండల అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి, ఎంపిటిసి బొళ్ళెం రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లాలం శ్రీరంగ స్వామి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ నిరంకుశ పాలన విధానాలకు వ్యతిరేకంగా, ప్రజల్ని చేతన్యం పరచడానికి లోకేష్ పాదయాత్ర చేపడుతున్నారన్నారు.

మాకవరపాలెం:రాచపల్లి కామేశ్వరమ్మ గుడి వద్ద టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం సాధిస్తుందన్నారు. వైసిపి పాలనకు చమరగీతం పాడాలనే ఉద్దేశ్యంతోనే పాదయాత్ర చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అల్లు రామునాయుడు, రుత్తల నందకిషోరు, రుత్తల శేషుకుమార్, జోగిపాత్రుడు, వి.గోవింద, కోసూరు శ్రీను, దుంగల రమణ, చిరంజీవి, అడిగర్ల చిన్నబాబు పాల్గొన్నారు

ఎస్.రాయవరం:పంచాయితీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు యేజర్ల వినోద్ రాజు, మండలశాఖ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం నేతృత్వంలో పెదగుమ్ములూరు శివారు చెల్లాపురం మసీదులో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. పెదగుమ్ములూరు చర్చి, అడ్డురోడ్డు ఆంజనేయస్వామి ఆలయంలోను ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వినోద్ రాజు మాట్లాడుతూ, ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి పాదయాత్ర దోహద పడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నల్లపరాజు వెంకటరాజు, గుర్రం రామకృష్ణ, కోన అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాత్రయాత్ర విజయవంతం కావాలని కోరుతూ మండలంలోని ఈ.బోనంగి పంచాయతీ ఫార్మాసిటీ కాలనీ కొండపై ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటిసి మాజీ సభ్యులు పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ అట్ట సన్యాసప్పారావు, ఆలయ కమిటీ చైర్మన్ గొర్లి కనకారావు, పరవాడ మండల నాయకులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట దుర్గాదేవి గుడి వద్ద లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ టిడిపి నాయకులు శుక్రవారం 108 కొబ్బరికాయలు కొట్టి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాయల మురళి, ఉగ్గిన రమణ మూర్తి, వేగి గోపి, సిదిరెడ్డి శ్రీను, పెంటకోట రాము, షేక్ బాబర్, సతీష్, తాకాసి కృష్ణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : లోకేష్ పాదయాత్ర దిగ్విజయంగా సాగాలని కోరుతూ స్థానిక శివాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు శుక్రవారం కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భీమరశెట్టి శ్రీనివాసరావు, దాడి ముసలి నాయుడు, మొల్లేటి సత్యనారాయణ, దాడి శివ, మళ్ల వరానరసింగరావు, ముల్లేటి సత్యనారాయణ ఆడారి గోవిందు, ప్రసాద్, కర్రి గణేష్, సూరిశెట్టి రాము, బొడ్డేడ గంగాధర్ పాల్గొన్నారు.



మాకవరపాలెంలో సంఘీభావం తెలుపుతున్న నేతలు



11వ వార్డులో పూజలు నిర్వహిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - ఆరిలోవ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ. 11వ వార్డు టిడిపి అధ్యక్షుడు ముగడ రాజారావు ఆధ్వర్యంలో శుక్రవారం బాలాజీనగర్ వినాయకుని ఆలయంలో వార్డు టిడిపి నాయకులు, కార్యకర్తలు 201 కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, ఆబోతుల అప్పలనాయుడు, మూది అప్పారావు, ఎం.కృష్ణంరాజు, గాడి సత్యం, కాలేషా, నమ్మి గణేష్ పాల్గొన్నారు.

13వ వార్డులో.. : యువగళం పేరుతో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ 13వవార్డు పరిధి ఆరలోవ కాలనీ, బ్రహ్మంగారి ఆలయం, శివాలయాలలో పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో వార్డు తెలుగు యువత అధ్యక్షులు తురకపూడి బాలస్వామి, సోనాపురం సుధాకర్, ఎస్‌సి సెల్ అధ్యక్షులు నూకరాజు పాల్గొన్నారు.

పిఎంపాలెం: విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి గరే గురునాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం చంద్రంపాలెం దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు లోకేష్ యువగళం పాదయాత్ర నిర్విఘ్నంగా సాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఆరో వార్డు టిడిపి బిసి సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, శ్రీను, వెంకటేష్, రమణ నందమూరి అభిమానులు, తెలుగు యువత, టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పద్మనాభం: లోకేష్ పాదయాత్ర విజయవంతంగా జరగాలని కోరుతూ టిడిపి మండల అధ్యక్షుడు కోరాడ రమణ ఆధ్వర్యంలో శుక్రవారం పద్మనాభం అనంత పద్మనాభుని సన్నిధిలోని కుంతీ మాధవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల,. గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న నాయకులు

లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న జిల్లా నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి:తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పేరుతో శుక్రవారం చిత్తూరు జిల్లా కుప్పంలో చేపట్టిన పాదయాత్రలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ వేర్వేరుగా లోకేష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పాదయాత్రలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రత్యేక హోదా, యువతకు రెండు లక్షల 30 వేల ఉద్యోగాలు, మెగా డీఎస్సీ, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ వంటి వాగ్దానాలు చేసి గెలిచిన తరువాత మోసగించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జంప మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్రలో టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పైలా మాట్లాడుతూ పాదయాత్ర ఆరంభంలోనే అనూహ్యమైన స్పందన వచ్చిందన్నారు. లోకేష్ పాదయాత్రలో వేసే ప్రతి అడుగు యువత గుండెల్లో ధైర్యం నింపుతుందని చెప్పారు. నాలుగు వేల కిలోమీటర్ల పాదయాత్ర దిగ్విజయంగా కొనసాగాలాని ఆయన ఆకాంక్షించారు.



లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న పైలా, బుద్ధ

బైక్ ర్యాలీ

గొలుగొండ:లోకేష్ చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం బైక్ ర్యాలీ చేపట్టారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు పప్పుశెట్టిపాలెంలోని బోడకొండమ్మతల్లి ఆలయం వద్ద నుంచి బైక్ ర్యాలీ ప్రారంభించారు. గొలుగొండ మండల కేంద్రం మీదుగా ఏజెన్సీ లక్ష్మీపురం శివాలయం వరకు పెద్ద ఎత్తున బైకుల ర్యాలీతో తరలి వెళ్లారు. లోకేష్ పాదయాత్రకు ఎటువంటి ఆటంకాలు తలెత్తకుండా కొనసాగాలని నేతలు ఆకాంక్షించారు.సుమారు 200 బైకులతో నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి సిహెచ్ తారకవేణుగోపాల్, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, టిడిపి మండల యూత్ అధ్యక్షులు కర్రి నాయుడు, గెడ్డం ఆనంద్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

హెటిరో పైప్‌లైన్‌ను అడ్డుకుంటాం

ప్రజాశక్తి- నక్కపల్లి:హెటిరో కంపెనీ ఏర్పాటు చేస్తున్న రెండవ పైప్ లైన్‌ను అడ్డుకుంటామని మత్స్యకారులు స్పష్టం చేశారు. హెటిరో పైప్ లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా శుక్రవారం నాటికి 422వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ, ఇప్పటికే ఉన్న పైప్ లైన్‌తో ఉపాధి కోల్పోయి రోడ్డును పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా మరో పైప్ లైన్ వేసి వ్యర్థ జలాలను సముద్రంలోకి వదిలితే తమ ఉనికికే ప్రమాదం వాటిలనున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకుని పైప్ లైన్ ఏర్పాటుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. మత్స్యకారులకు వ్యతిరేకంగా పైపులైన్ ఏర్పాటు చేస్తే ప్రాణాలను ఫలంగా పెట్టి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గోసల సోమేశ్వరరావు, నూకరాజు, గురన్న, దాసరాజు, గోపి, పిక్కి రాజు, శివాజీ, వెంకటేష్, నాగరాజు, రాజు, అప్పలరాజు, బాబూజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మావతి

ఆర్‌టిసి డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా రవాణా శాఖ అధికారి పద్మావతి

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్:ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని జిల్లా రవాణా శాఖ అధికారి పద్మావతి సూచించారు. నర్సీపట్నం ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం సిబ్బందికి డ్రైవింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, డిపో పరిధిలో జరుగుతున్న యాక్సిడెంట్ల నివారణకు డ్రైవర్లు కృషి చేయాలని తెలిపారు. జీరో యాక్సిడెంట్ డిపోగా నర్సీపట్నం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గోవిందరావు, డిపో మేనేజర్ ధీరజ్, మెకానిక్ ఫోర్ మెన్ ఆచారి, డ్రైవర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ అప్పారావు

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-కోటవురట్ల:ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి నాణ్యమైన విద్యను అందజేయాలని ఎంఈఓ పెన్నడ అప్పారావు సూచించారు. శుక్రవారం మండల సమావేశం మందిరంలో మండల ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంతో పాటు విద్యార్థులను తమ సొంత బిడ్డల మాదిరిగా చూసుకోవాలన్నారు.ప్రతి ఉపాధ్యాయులు కంప్యూటర్ నాలెడ్జ్‌పై అవగాహన పెంచుకోవాలని, అదేవిధంగా జగనన్న గోరుముద్ద సక్రమంగా అందేందుకు ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలన్నారు. నాడు నేడు పనులు జరుగుతున్న పాఠశాలలో నాణ్యత ప్రమాణాల పట్ల దృష్టి సారించాలని, పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలకు విద్యుత్ లైన్ల ఏర్పాటు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో నాలుగు గ్రామాల్లో జగనన్న కాలనీలకు విద్యుత్ లైన్ల పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఎలక్ట్రికల్ ఏఈ కె.పద్మనాభం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో కొండపాలెం, కొమరవోలు, జానకి రాంపురం జగనన్న కాలనీల్లో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు వేయడం జరిగిందన్నారు. కుసర్లపూడి గ్రామంలో పోల్స్ వేశామన్నారు. ప్రస్తుతం పూర్తయిన మూడు గ్రామాల్లోని లబ్ధిదారులు మీటర్లు వేసుకొని కరెంట్ వాడుకోవచ్చుని సూచించారు.



ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్

Mrs. MARIADAS SCHOOL
Annamma Colony: Sriharipuram: Visakhapatnam - 530011
ADMISSION NOTICE
Application forms for admission to LKG to Std VIth for the academic year 2023 - 2024 are being issued from January 28th- 2023 from the School Office, Annamma Colony, Sriharipuram.
CORRESPONDENT

2న విశాఖకు విద్యార్థి, యువజన సమరయాత్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమరయాత్ర ఫిబ్రవరి 2న విశాఖ నగరానికి చేరుకుంటుందని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ఫణీంద్ర తెలిపారు. ఈ యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విద్యార్థి, యువజన సంఘాల నాయకులు శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి 2014లో పార్లమెంట్ సాక్షిగా ఎపికి ప్రత్యేక హోదా ఇస్తామని, విభజన హామీలు అమలు చేస్తామని చెప్పి మోసం చేసిందని మండిపడ్డారు. ఆనాడు ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైసిపి 25 ఎంపీ స్థానాలు గెలిపిస్తే, కేంద్రంలో ఎవరు ఉన్నా, మెడలు వంచి ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా తెస్తామని, విభజన హామీలు అమలు జరిగేలా చూస్తామని చెప్పి నేడు ఆ విషయాన్నే పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థి, యువజన సంఘాలుగా ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 4 వరకు హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు సమరయాత్ర చేపట్టామని తెలిపారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, పోలవరం ప్రాజెక్ట్‌కు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమరయాత్ర విశాఖకు ఫిబ్రవరి 2న చేరుకుంటుందని, ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు భారీ సభ నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లాలో ఉన్న విద్యార్థులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొని ఈ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, ఎఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ ఎం.రాంబాబు, పిడిఎస్ఒ నాయకులు విశ్వనాథ్, ఎఐవైఎఫ్ నాయకులు మధు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం వద్దు

ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి-నక్కపల్లి:జగనన్న చేదోడు సహా అనేక ప్రభుత్వ పథకాలకు సంబంధించి కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం చేయవద్దని ఆర్డీవో జయరాం ఆదేశించారు.శుక్రవారం మధ్యాహ్నం ఆయన నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రెవిన్యూ సమస్యలపై చర్చించారు. మండలంలో 22ఏ రికార్డులో నమోదైన భూములకు సంబంధించి సమగ్ర వివరాలను సిద్ధం చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. వీటిపై ఒకటి, రెండు రోజుల్లో కలెక్టర్ సమీక్షించే అవకాశం వుందన్నారు. జగనన్న ఇళ్ల స్థలాలకు సంబంధించి ఒకటి, రెండు గ్రామాల్లో సమస్యలు ఉన్నందున లబ్ధిదారులు గృహాలు కట్టుకోవడానికి ముందుకు రాలేదని ఎంపీడీవో సీతారామరాజు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీ సుబ్రహ్మణ్యశాస్త్రి, డీటీ నీరజ, ఈవోఆర్డీ వెంకట నారాయణ వైస్ ఎంపీపీ నానాజీ, ఆర్ఎస్ఐలు ప్రసాద్, నర్సింగరావు, పాల్గొన్నారు .



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ జయరాం

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లిలో శ్రీ నూకాంబిక ఎలక్ట్రికల్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎలక్ట్రీషియన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టిసి కాంప్లెక్స్ వద్ద వేడుకలు నిర్వహించగా, ముఖ్య అతిథులుగా రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ హాజరయ్యారు. విద్యుత్ బల్బు, ఫోనోగ్రాఫ్ వంటి అనేక ఉపకరణాలను రూపొందించిన అమెరికన్ శాస్త్రవేత్త దామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యూనియన్ అధ్యక్షులు పొన్నాడ ప్రభాకర్రావు ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు, సభ్యులు ర్యాలీగా బయలుదేరి స్థానిక ఆసుపత్రికి చేరుకుని రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



దామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జమునకు నివాళి

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ:సినీ నటి జమున మృతి పట్ల విశాఖ నగరంలో పలువురు సంతాపం ప్రకటించారు. కొన్నిచోట్ల ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆమె మృతి తెలుగు సినిమా పరిశ్రమకు తీరని నష్టమని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఆమె మృతికి నివాళులు అర్పించడానికి ఆదివారం మధ్యాహ్నం 12.45 గంటలకు ఎయు మానవ వనరుల అభివృద్ధి శాఖ ప్రాంగణంలో సొసైటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

పిఎన్ఎం సంతాపం

జమున మృతి పట్ల ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రమణ, ఎం.చంటి, గౌరవాధ్యక్షులు దండు నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు అరుణ్‌జీ సంతాపం ప్రకటించారు. జమున అనేక సందేశాత్మక చిత్రాల్లో నటించి మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ప్రజానాట్య మండలి రూపొందించిన మా భూమి నాటకంలో నటించారన్నారు. అనంతరం రాజారావు దర్శకత్వంలో పుట్టిల్లు చిత్రంలోనూ మంచి పాత్ర పోషించారన్నారు. నేటితరం కళాకారులు ఆమెను ఆదర్శంగా తీసుకొని కళను ప్రజల కోసం అంకితం చేయాలన్నారు.

అధికారులకు ఘన సత్కారం



ఎంపిడిఒను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నక్కపల్లి:ఉత్తమ ఎంపీడీవోగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు పొందిన ఎంపీడీవో డి.సీతారామరాజును శుక్రవారం పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు సన్మానించారు. మండల పరిషత్ సమావేశం మందిరంలో శుక్రవారం ఎంపీడీవోగా పురస్కారం అందుకున్న సీతారామరాజును ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ నక్కపల్లి సర్పంచ్ నేతల జయరత్నకుమారి, వైస్ ఎంపీపీ నానాజీ, ఈవోఆర్డీ వెంకట నారాయణ, ఉపాధి హామీ పథకం ఏపీఓ ఈశ్వరరావు సత్కరించారు.

రావికమతం:ఉత్తమ పురస్కారాలు అందుకున్న రావికమతం మండలం తహసీల్దారు ఉమామహేశ్వరరావు, మండల సర్వేయర్ సత్యనారాయణలను వైసిపి నాయకులు, మండల ఆగ్రో అడ్వైజరీ కమిటీ చైర్మన్ కంచిపాటి జగన్నాధరావు, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బంటు సన్యాసినాయుడులు మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జగ్గారావు మాట్లా డుతూ, విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ప్రతి అధికారికి మంచి గుర్తింపు లభిస్తుందని ఆయన అన్నారు.ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే చక్కగా నిర్వహించారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను సామరస్యంగా పరిష్కరించడంలో తహశీల్దారు కృషి చేస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో మండలానికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా పని చేసి మరిన్ని ఉత్తమ పురస్కారాలు పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గుడ్డిప సర్పంచ్ గుమ్మాల గణేశ్వరరావు, కెబిపి అగ్రహారం సర్పంచ్ కలిగిరి ప్రసాద్ పలువురు పాల్గొన్నారు.



తహశీల్దార్‌ను సన్మానిస్తున్న నేతలు